ఏడీఏగా ఆదిలక్ష్మి బాధ్యతల స్వీకరణ

ఆమనగల్లు, జూన్ 18 : ఆమనగల్లు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులుగా డి.ఆదిలక్ష్మి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఏడీఏగా మహేశ్వరం ఏడీఏ సుజాత ఇన్‌చార్జిగా నిర్వహించారు. రాజేంద్రనగర్ రైతు శిక్షణ కేంద్రంలో ఏడీఏగా పనిచేస్తున్న ఆదిలక్ష్మికి ఆమనగల్లులో పోస్టింగ్ ఇచ్చారు. కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. పంటల సాగు, విత్తనాల, ఎరువుల కొనుగోళ్లలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తేవాలని రైతులకు సూచించారు.





రోజురోజుకూ పెరుగుతున్న ధరలు వంటింట్లో కుంపటి లేపుతున్నాయి. ఏ నిత్యావసర వస్తువు కొందామన్నా వాటి ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి. ప్రతీ ఇంట్లో సాధారణంగా వినియోగించే టమాట ధర కిలో వందకు చేరింది. కూరల్లో వాడే అల్లం వెల్లుల్లి కిలో రేటు 200పై మాటే. ఆకుకూరల నుంచి కూరగాయల వరకు ధరలు భారీగా పెరిగాయి. అటు చికెన్ రేటు సైతం ఆకాశన్నంటింది. అలాగే కందిపప్పు రేటు ఎక్కువగానే ఉంది. మార్కెట్‌కు వెళ్లి ఏది తెచ్చి వండుకుందామన్నా అధిక ధరలతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. పోయిన వానాకాలంలో సరిగా వర్షాలు కురవక పోవడం, యాసంగిలో ఎండదెబ్బ, నీటి కొరతతో సాగు విస్తీర్ణం తగ్గి ఉత్పత్తి పడిపోయింది. ఈ కారణాలతో డిమాండ్‌కు సరిపడా సప్లయ్ లేకపోవడంతో కూరగాయల ధరలు భారీగా పెరుగుతున్నాయి.

ధరల మోత!

అమాంతం పెరిగిన కూరగాయల ధరలు

- ఆరు నెలలుగా సామాన్యుడికి అందని అల్లం వెల్లుల్లి
- మంట పుట్టిస్తున్న పచ్చిమిర్చి, టమాట, బీన్స్, చిక్కుడు
- బియ్యం, కంది పప్పు ధరలూ పైపైకి
- స్వల్పంగా పెరిగిన నూనెల ధరలు

ఆంధ్రజ్యోతి-రంగారెడ్డి అర్బన్/మేడ్చల్/తాండూరు/పరిగి, జూన్ 18: పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్యులు అల్లాడుతున్నారు. ఏ వస్తువు కొందామన్నా భగ్గుమంటున్న రేట్లతో ప్రజలకు చుక్కలు కనిపిస్తున్నాయి. పప్పు నుంచి ఉప్పు వరకు, కరివేపాకు నుంచి కాకరకాయ వరకు చికెన్ నుంచి అల్లంవెల్లుల్లి వరకు ఏది చూసినా అధిక ధరలు విపరీతంగా పెరిగాయి. పది రోజులుగా పెరుగుతున్న ధరలతో జనం బెంబేలెత్తుతున్నారు. కరువు, వేసవి దెబ్బ దిగుబడిలేక పెరిగిన ధరలతో అటు కొనుగోలుదారులు, ఇటు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. రూ.500 పెట్టినా రెండు రకాల కూరగాయలు, ఇద్దరు మనుషులకు మూన్నాలుగు రోజులు రావడం లేదు. ఇక కూరగాయల ధరలతో చికెన్ కూడా పోటీ పడుతోంది. కేజీ రూ.266కి పెరిగింది. అటు కూరగాయలు కొనలేక.. ఇటు చికెన్ తినలేక సామాన్యులు అల్లాడుతున్నారు. ఈ ధరలు ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో పచ్చడి అన్నం తప్పేలా లేదంటున్నారు పేద, మధ్య తరగతి ప్రజలు. ఇక అన్ని వంటకాల్లో తప్పనిసరిగా ఉపయోగించే టమాటా ధర ఇప్పటికే సెంచరీకి చేరింది. రైతు మార్కెట్లలో కిలో రూ.80 విక్రయిస్తున్నా రీటైల్‌గా మాత్రం రూ.90 నుంచి రూ.100కు అమ్ముతున్నారు. రానున్న రోజుల్లో ధర ఎంత పెరుగుతుందోనన్న ప్రశ్న రేకెత్తుతోంది. టమాటనే కాక మిగతా కూరగాయల పరిస్థితీ ఇలానే ఉన్నాయి. పచ్చిమిర్చి కిలో రూ.100 ఉంటే.. బీన్స్ ఈ ధరను దాటేసింది. ప్రస్తుతం కిలో బీన్స్ 160కి విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో చిక్కుడు సప్లయ్ తగ్గింది. ప్రస్తుతం దీని ధర కిలో రూ.100 ఉంది. కూరల్లో రుచి కోసం ఉపయోగించే అల్లంవెల్లుల్లి ధర ఆకాశానికి నిచ్చెన వేసింది. కిలో అల్లం వెల్లుల్లి రూ.200కు విక్రయిస్తున్నారు. మిగతా కూరగాయల ధరలను పరిశీలిస్తే కాకరకాయ, బెండ, బీరకాయ ధరలు కిలో రూ.80 చొప్పున విక్రయిస్తున్నారు. క్యాలీఫ్లవర్, క్యారెట్, కిలో 50కి అమ్ముతున్నారు. ఆలుగడ్డ, ఉల్లిగడ్డ కిలో 40రూపాయలకు విక్రయిస్తుండగా కొత్తిమీర కట్ట 30రూపాయలు, ఒక నిమ్మకాయ 10రూపాయలకు విక్రయిస్తున్నారు. ఇదిలా ఉంటే బియ్యం, కంది పప్పు ధర భగ్గుమంటుంది. నెల క్రితం 160 రూపాయలు ఉన్న కందిపప్పు రూ.190కి చేరింది. నూనె ధరలూ స్వల్పంగా పెరిగాయి. లీటర్ నూనెపై ఐదు రూపాయలు పెరిగింది. గతేడాది ఇదే సమయంలో 25 కిలోల బియ్యం బస్తా 1,200కు విక్రయించగా ప్రస్తుతం 1,600కు అమ్ముతున్నారు. కూరగాయల ధరలు పెరగడానికి ఎండ దెబ్బ.. సకాలంలో వర్షాలు పడకపోవడం, దిగుబడి లేకపోవడం ఇలా అనేక కారణాలు కన్పిస్తున్నాయి. నెలాఖరు వరకు ఈ పరిస్థితి ఇలాగే ఉంటుందని.. రాబోయే రోజుల్లో టమాట, పచ్చిమిర్చి, ఉల్లిపాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.



చేవెళ్ల వ్యవసాయ మార్కెట్‌లో కూరగాయల వద్ద వ్యాపారుల సందడి

కూరగాయలు	కిలో ధర (రూపాయలు)
అల్లం వెల్లుల్లి	200
బీన్స్	160
టమాట	100
పచ్చిమిర్చి	100
చిక్కుడు	100
బెండకాయ	80
గోకర	80
కాకర	80
చామగడ్డ	80
బీరకాయ	80
దొండ	60
క్యారెట్	50
క్యాబేజీ	40
బీట్‌రూట్	50
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	40
కొత్తిమీర(ఒక కట్ట)	20
నిమ్మకాయ(ఒకటి)	10

టమాట, ఉల్లి, పచ్చిమిర్చి ధరలు తగ్గడం లేదు



వారం రోజుల నుంచి టమాట ధర తగ్గడం లేదు. కిలో 50 రూపాయలు ఉన్న టమాట 100 రూపాయలకు చేరింది. అల్లం వెల్లుల్లి ధర కూడా పెరిగింది. పచ్చిమిర్చి, చిక్కుడు, బీన్స్, నిమ్మకాయల ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. డిమాండ్‌కు సరిపడా సరఫరా లేదు. అందుకే రేట్లు పెరుగుతున్నాయి.

- సుదర్శన్, కూరగాయల వ్యాపారి, లాల్‌పహాడ్

ఈసారే టమాట సాగు చేశా



ఈ సారి మొదటి సారి నేను టమాట పంట మూడెకరాల్లో సాగు చేశాను. బోరులో నీరుండటంతో డ్రిప్పు విధానంతో టమాట వేశాను. పంట పెట్టుబడిగా ఎకరానికి రూ.40వేల చొప్పున మూడెకరాలకు రూ.1.20లక్షలు ఖర్చు పెట్టాను. ఇప్పటి వరకు సగం కోత పూర్తి అయ్యింది. రూ.15లక్షల వరకు లాభం వచ్చింది. వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు సబ్సిడీపై డ్రిప్పు, విత్తనాలు ఇచ్చేవారు. ఇప్పుడు ఇవ్వడం లేదు. రైతులను ప్రోత్సహించాలి. సబ్సిడీలు అందిస్తేనే రైతులు వ్యవసాయం వైపు మొగ్గు చూపుతారు. అంతటా రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడంతో రైతులు భూములు అమ్ముకొని వచ్చిన డబ్బులతో జీవిస్తున్నారు. దీంతో పంటల సాగు భారీగా తగ్గుతోంది. ఉత్పత్తి భారీగా పడిపోతూ ధరలు పెరుగుతున్నాయి.

- దేవులపల్లి గోపాల్‌రెడ్డి, రైతు, వనంపల్లి, జిల్లేడు చౌదరిగూడెం మండలం

భగ్గుమంటున్న కూరగాయల ధరలు



కూరగాయల ధరలు భగ్గుముంటున్నాయి. రూ.500లతో మార్కెట్‌కు వెళితో బ్యాగు నిండా కూడా కూరగాయలు రావడం లేదు. ముఖ్యంగా టమాట, పచ్చిమిర్చి వంటి నిత్యం కూరల్లో వాడే వాటి ధరలు మండిపోతున్నాయి. ఏ కూరగాయలైనా పావుకిలో రూ.40కి తక్కువకు దొరుకడం లేదు. పంట దిగుబడి రాకపోవడమే కూరగాయల పెరుగుదలకు కారణమని చెప్తున్నా పెరిగిన కూరగాల ధరలతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు.

- రూప, గృహిణి, మేడ్చల్

ఈ ధరలు ఎన్నడూ చూడలేదు



ఈ స్థాయిలో కూరగాయల ధరలను ఎన్నడూ చూడలేదు. బీరకాయ, మిర్చి కిలో రూ.120లకు చేరింది. ఇటీవల రూ.10లకు కిలో ఉన్న టమాట రూ.80లకు చేరింది. ఏ కూరగాయలు చూసినా రూ. వందకు చేరింది. కూరగాయలు కాకుండా ఏ వస్తువు కొనాలన్న ధరలను చూస్తే ఆలోచించాల్సి వస్తుంది.

-స్వరూప, గృహిణి,పరిగి

ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు



మార్కెట్‌లో ఏది ముట్టుకున్నా 50రూపాయల పైమాటే. కనీసం సాంబారు మెతుకులు తిందామంటే కూడా కందిపప్పు రేటు మండిపోతుంది. నాణ్యమైన కందిపప్పు కిలో 200 రూపాయలకు అమ్ముతున్నారు. కూరగాయలు కొందామన్నా.. ధరలు అందుబాటులో లేవు. టమాట, పచ్చిమిర్చి, బీన్స్, చిక్కుడు మంట పుట్టిస్తున్నాయి. రూ.500 తీసుకుని మార్కెట్‌కు వెళితే నిండా ఐదారు కిలోల కూరగాయలైనా రావడం లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే సామాన్యుల పరిస్థితి కష్టమే.

- డి.సువర్ణ, గృహిణి, చేవెళ్ల



మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ తీగల అనితారెడ్డి

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

- జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

మహేశ్వరం, జూన్ 18 : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్న వైద్యాధికారులు, సిబ్బందిలో మార్పు రావాలని, లేకుంటే అలాంటి వారిని సహించేది లేదని జడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మహేశ్వరం మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఇక్కడ డాక్టర్ల పనితీరు ఎలా ఉంది.. వైద్య సేవలు ఎలా అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. దీంతో రోగులు సమయానికి డాక్టర్లు ఎవరూ ఉండరని, రాత్రిపూట అసలే డాక్టర్లు ఉండడం లేదని చెప్పారు. దీంతో అనితారెడ్డి మాట్లాడుతూ కోట్ల రూపాయల నిధులతో ప్రభుత్వం ఆసుపత్రులను నిర్మించి అన్ని రకాల వైద్య పరికరాలు ఏర్పాటు చేసినా వైద్య సేవలు అందించడంలో ఇక్కడి డాక్టర్లు, సిబ్బంది పనితీరు సంతృప్తిగా కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనుంచైనా వైద్య సేవలు అందించే విషయంలో మార్పు రాకపోతే తగిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి వెంట మహేశ్వరం ఎంపీపీ ఆర్. సునీతా అంద్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

భౌభౌయ్!

- జనంపై దాడిచేసి గాయపరుస్తున్న కుక్కలు
- నల్లవెల్లిలో 15 మేకలను కొరికి చంపిన గ్రామసంహాలు





చిన్నతూండ్లలో పాఠశాల వద్ద కుక్కల గుంపు

యాచారం, జూన్ 18 : యాచారం మండలంలోని వివిధ గ్రామాలలో వీధికుక్కల బెడదతో జనం బేజారవుతున్నారు. బ్రాయిలర్ కోళ్ల షెడ్లలో చనిపోయిన కోళ్లు వీటికి ఆహారంగా దొరుకుతోంది. అవి దొరకని రోజు జనంపై దాడి చేస్తున్నాయి. ఒంటరిగా కనిపించిన మనుషులపై, ద్విచక్ర వాహనాలపై ఒంటరిగా వెళ్లనన వారిపై మూకుమ్మడిగా దాడిచేసి గాయపరుస్తున్నాయి. నెల రోజుల క్రితం నల్లవెల్లిలో 15 మేకలను చంపి తినేశాయి. కుర్మిద్ద, తాటిపర్తి గ్రామాలలో వీధి కుక్కలు పశువుల దూడలను చంపి తిన్నాయి. నానక్‌నగర్‌లో రాత్రివేళ రైతులు పొలాలకు వెళుతుండగా దాడిచేసి నలుగురు రైతులను తీవ్రంగా గాయపరిచాయి. కుర్మిద్దలో నాలుగు ఆవులను గాయపరిచి ఓ దూడను చంపి తిన్నాయి. చింతపట్లలో రెండు మేకలను చంపి తిన్నాయి. మాల్‌లో పశువులపై దాడి చేసి రెండు ఆవులను గాయపరిచాయి. చిన్నతూండ్లలో నాలుగు పశువుల దూడలను చంపితిన్నాయి. వీధి క్కులు ఇలా స్వైర విహారం చేస్తున్నాయని, వాటినుంచి తమకు రక్షణ కల్పించాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మే నెలలో 43 మందిని. జూన్‌లో ఇప్పటి వరకు 33మందిని వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయని స్థానికులు చెబుతున్నారు.

మందులకు కొరత లేదు



వీధికుక్కల దాడిలో గాయపడిన ప్రతీ ఒక్కరికి మందులు అందుబాటులో ఉన్నాయి. కుక్కకాటు మందుకు హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పని లేదు. కుక్కకాటు ఇంజక్షన్ నాలుగైదు డోసులుండగానే అదనంగా తెప్పించి సిద్ధం చేస్తున్నాం. తమ ఇళ్లలో ఉన్న కుక్కలకు తరచూ ఇంజక్షన్లు వేయించుకుంటే మంచిది. చిన్నపిల్లలను ఒంటరిగా వదలకండి. కుక్కల దాడిలో గాయపడిన వారు ఏ క్షణమైనా ఆసుపత్రికి వస్తే మెరుగైన చికిత్స చేసి ఆదుకుంటాం.

- డాక్టర్ రాజ్యలక్ష్మి, యాచారం మండల వైద్యాధికారి

వీధి కుక్కల బెడద ఉంది



చనిపోయిన కోళ్లను తిని వీధి కుక్కలు పశువులపై, ఒంటరిగా ఉన్న మనుషులపై దాడులు చేస్తున్నాయి. రైతులకు చాలా అన్యాయం జరిగిన మాట వాస్తవమే. తాము ఇదే విషయమై పశుసంవర్ధక శాఖ అధికారులతో మాట్లాడి జనాలకు హాని చేయకుండా తగిన చర్యలుతీసుకుంటాం. రేబిస్ వ్యాధి సోకకుండా ప్రభుత్వాసుపత్రి వైద్యులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటాం. చనిపోయిన బ్రాయిలర్ కోళ్లను వీధి కుక్కలకు ఆహారంగా వేయకుండా గోతిలో పాతి పెట్టాలని కోళ్లఫాం నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తాం.

తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి, యాచారం

ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

- బూటకపు బెదిరింపుగా తేల్చిన అధికారులు
- స్పైస్‌జెట్ విమానంలో సాంకేతిక లోపం
- విమానాశ్రయంలోనే 8 గంటల పాటు ప్రయాణికుల పడిగాపులు

శంషాబాద్ రూరల్, జూన్ 18 : శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు వచ్చింది. అప్రమత్తమైన పోలీసులు, భద్రతాబలగాలు తనిఖీలు చేసి బూటకపు బెదిరింపని అని తేల్చారు. విమానాశ్రయంలో బాంబు పెట్టామని, అది పేలనుందని విమానాశ్రయానికి మంగళవారం మధ్యాహ్నం 12.15 నిమిషాలకు ఓ మెయిల్ వచ్చింది. దాంతో సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, జీఎంఆర్ సిబ్బంది, పోలీసులు డాగ్‌స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌లతో విమానాశ్రయమంతా తనిఖీలు చేశారు.విమానాశ్రయంలో ఎలాంటి బాంబు అమర్చలేదని తేల్చారు. ఎవరో అకతాయిలు ఈ బెదిరింపు మెయిల్ పంపి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఆ మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు పంపారన్న దానిపై వారు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు శంషాబాద్ నుంచి ఢిల్లీ మీదుగా జమ్మూ వెళ్లాల్సిన స్పైస్ జెట్ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దాంతో ప్రయాణికులు విమానాశ్రయంలోనే 8గంటల పాటు పడిగాపులు కాయాల్సి వచ్చింది. మంగళవారం 100మంది ప్రయాణికులతో ఎస్‌జీ160 విమానం శంషాబాద్ నుంచి జమ్మూ వెళ్లాల్సి ఉండగా టేకాఫ్ సమయంలో సాంకేతిక లోపం తలెత్తింది. నిపుణులు వచ్చి పరిశీలించి సమస్య తీవ్రమైనదిగా ఉందని, సమయం పడతుందని తెలిపారు. విమానయాన సంస్థ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోడంతో ప్రయాణికులు 8 గంటలపాటు విమనాశ్రయంలో ఎదురుచూడాల్సి వచ్చింది. విమానయాన సంస్థ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ప్రయాణికులు ఆందోళన కూడా చేశారు. కొందరు ప్రయాణికులు టికెట్లు రద్దు చేసుకుని ఇతర విమానాల్లో వెళ్లిపోయారు. సాంకేతిక లోపాన్ని సరిచేయడంతో ఎట్టకేలకు మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత సదరు విమానం టేకాఫ్ అయ్యింది.

నులిపురుగుల మాత్రలు తప్పక వేయించాలి

చేవెళ్ల, జూన్ 18 : పిల్లల్లో నులి పురుగులను నిర్మూలించి ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించేందు ప్రతి ఒక్కరూ సహకరించాలని చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్ అన్నారు. మంగళవారం చేవెళ్లలోని పీఎంఆర్ మెడికల్ కళాశాలలో డివిజన్ స్థాయి ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, గురుకులాల హెచ్‌ఎంలకు, ఇంటర్మీడియెట్ కాలేజీల ప్రిన్సిపాళ్లకు తదితరులకు పిల్లల్లో నులి పురుగుల నివారణపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ 12 నెలల పిల్లల నుంచి 19ఏళ్ల వయస్సున్న పిల్లల వరకు ఆల్బెండజోల్ మాత్రలను నమిలించి మింగించాలని సూచించారు. నులిపురుగుల రహిత సమాజాన్ని నిర్మించేందుకు అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ నెల 20న అందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. ప్రతీ పాఠశాలలో దీనికోసం ఒక టీచర్‌ను నోడల్ అధికారిగా కేటాయించామన్నారు. ఈ ట్యాబ్లెట్ నమిలి మింగితే పిల్లల్లో ఎలాంటి దుష్పరిణామాలూ చోటుచేసుకోవన్నారు. పిల్లల తల్లిదండ్రులను ఒప్పించి ఉపాధ్యాయులు మాత్రలు తప్పక వేయించాలని తెలిపారు. ఏదైనా సమస్య వస్తే వైద్యుల వద్దకు తీసుకెళ్లాన్నారు. సమావేశంలో వైద్యులు రాజేశ్వర్ రావు, రామకృష్ణారెడ్డి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్



మాట్లాడుతున్న డాక్టర్

ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి

మాడ్గుల: గ్రామాల్లో 1 నుంచి 19 సంవత్సరాల వయసున్న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను తప్పక వేయాలని డాక్టర్ మోహన్ తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో అవగాహ న కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 20న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వేస్తామని తెలిపారు. ఈ మాత్రలను ఇళ్లకు ఇవ్వొద్దన్నారు. 1 నుంచి 2సంవత్సరాల చిన్నారులకు సగం మాత్ర, 2 నుంచి 19సంవత్సరాల వారికి ఒక మాత్ర వేయాలని వైద్యాధికారి సూచించారు.



కడ్తాలలో హాల్ టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

ప్రశాంతంగా యూజీసీ నెట్ పరీక్ష

కడ్తాల్, జూన్ 17: యూజీసీ నెట్ పరీక్ష కడ్తాలలోని పార్ద్యాస్ బట్లర్ పై స్కూల్‌లో ప్రశాంతంగా జరిగింది. మంగళవారం నిర్వహించిన పరీక్షలో నారాయణపేట, మహబూబ్‌నగర్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ , జడ్చర్ల, వనపర్తి, రంగారెడ్డి జిల్లాలకు చెందిన660 మంది విద్యార్థులు హాజరయ్యారని సెంటర్ అబ్జర్వర్లు సుజాత, అనిల్, డిప్యూటీ అబ్జర్వర్ సత్యనారాయణ, సూపరింటెండెంట్ రంగారావు, డిప్యూటీ సూపరింటెండెంట్ భుజంగరావు లు తెలిపారు. ఉదయ సెషన్‌లో 276 మంది విద్యార్థులకు 182, మధ్యాహ్నం సెషన్ లో 600 మందికి 478 మంది హాజరాయ్యారని వారు తెలిపారు. పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే విద్యార్థులు హాజయ్యారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమన్న నిబంధనలతో విద్యార్థులందరూ పరీక్ష కేంద్రానికి ముందుగానే చేరుకున్నారు. పరీక్ష నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సంజీవ్ నాంపల్లి తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

కులకచర్ల, జూన్ 18: స్థానిక పీవీఆర్ ఫంక్షన్ హాలులో కుమ్మరి స్వామి జన్మదిన సందర్భంగా గురువారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు చంద్రలింగం మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురి అరెస్ట్

- ఘట్‌కేసర్‌లో ముగ్గురు, మేడ్చల్‌లో ఇద్దరు నిందితుల రిమాండ్
- మొత్తం 5.50కిలోల గంజాయి స్వాధీనం



ముగ్గురు నిందితుల అరెస్టు చూపుతున్న ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు

మేడ్చల్ టౌన్/ఘట్‌కేసర్ రూరల్, జూన్ 18: గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని మేడ్చల్, ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, రాఘవేంద్ర హోటల్ సమీపంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా బైక్‌ను ఆపి సోదాచేయగా అందులో రెండు కిలోల గంజాయి పట్టుబడింది. బైక్ నడుపుతున్న ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, బాలాజీనగర్‌కు చెందిన సయ్యద్ జఫర్(24), యాదాద్రి- భువనగిరి, బీబీనగర్ మండలం, నెమురగొమ్ములకు చెందిన పల్లపు గణేష్, నగరానికి చెందిన రాజుకుమారి బాయి(43)లను అదుపులోకి తీసుకున్నారు. 500 గ్రాముల గంజాయితో పాటు హోండా షైన్ బైక్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. మేడ్చల్‌లో ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపిన వివరాల ప్రకారం.. దేవర్ యాంజాల్ కేశినేని కార్గో కారియర్ సమీపంలో నివసించే ఒడిశాకు చెందిన శంకర్‌బాగ్(28), సిబాఖిలా(24)లు మంగళవారం శామీర్‌పేట మండలం దేవర్ యాంజాల్ వైను నుంచి మేడ్చల్ వస్తుండగా ఎక్సైజ్ పోలీసులు వారిని సోదాలు నిర్వహించారు. వారి వద్ద నుంచి మూడు కిలోల 50గ్రాముల బంగారం లభించింది. దీంతో ఇద్దరిని అదుపులో తీసుకుని విచారించగా మేడ్చల్ పారిశ్రామిక వాడలోని లేబర్లకు, కళాశాలల విద్యార్థులకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. గంజాయితోపాటు ఇద్దరు నిందితుల వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.



మేడ్చల్ టౌన్: ఎక్సైజ్ అధికారులకు పట్టుబడిన నిందితులు

ఫాం ల్యాండ్ పేరుతో నయా దందా

- వ్యవసాయ భూములను ప్లాట్లుగా మారుస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు

మర్పల్లి, జూన్ 16: ఫాం ల్యాండ్ పేరుతో పల్లెల్లో పదుల సంఖ్యలో వెంచర్‌లు పుట్టుకొస్తున్నాయి. వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చుతున్నారు. దీంతో పచ్చని పంట పొలాలు బీడుగా కనిపిస్తున్నాయి. అక్రమార్కులు ప్రభుత్వ నిబంధనల్లోని లోసుగులను ఆసరాగా చేసుకొని నాలా పన్నును ఎగవేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మర్పల్లి మండలంలోని పట్లూర్, ఘనపూర్, తుమ్మలపల్లి, బిల్కల్, మల్లికార్జునగిరితో పాటు తదితర గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లో వెంచర్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. రోడ్డుపక్కన సిమెంట్ కడ్డీలతో ప్రహరీ నిర్మిస్తూ ప్రధాన రహదారిలో అందమైన ఫెన్సింగ్, పొలాల్లో రోడ్లు ఏర్పాటుచేసి ఫాం ల్యాండ్ పేరుతో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు నయా దందాకు తెరలేపారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వహిస్తుండటంతో రియల్ వ్యాపారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

ప్రభుత్వ ఖజానాకు గండి

వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చాలంటే ప్రభుత్వానికి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అమ్మకందారులు కొనుగోలుదారులు రిజిస్టర్ కార్యాలయాల్లో నిబంధనల మేరకు మార్కెట్ ధరను బట్టి డబ్బులు చెల్లించాలి. అదేవిధంగా 10శాతం భూమిని గ్రీన్‌ల్యాండ్‌కు సంబంధిత గ్రామపంచాయతీకి అప్పగించాల్సి ఉంటుంది. మరో 15శాతం భూమిని రోడ్లకు కేటాయించి సదరు భూమిని పంచాయతీ పేరుపై రిజిస్ట్రేషన్ చేసి అనుమతి పొందాల్సి ఉంటుంది. ఈ నిబంధనలను తుంగలో తొక్కుతూ కొందరు రియల్ వ్యాపారులు పన్ను చెల్లించకుండానే వ్యవసాయ భూములను కొనుగోలు చేసి భూముల చుట్టూ సిమెంట్ కడ్డీలను ఏర్పాటు చేసి పొలాల్లో రోడ్లు వేసి ప్లాట్లుగా మార్చేస్తున్నారు.


వ్యవసాయ పొలంలో ఫాం ల్యాండ్

ధరణిలో అందివచ్చిన అవకాశం

వ్యవసాయ భూములను ఫాం ల్యాండ్ పేరుతో వెంచర్లుగా ఏర్పాటు చేసి విక్రయిస్తున్న రియల్ వ్యాపారులు 'ధరణి'లో అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. గుంట భూమి సైతం రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం ఉండటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు గుంట లెక్కన విక్రయిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. తర్వాత ఫాం ల్యాండ్ పేరుతో నిబంధనలను తుంగలో తొక్కి నయా తరహాలో వెంచర్లుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ ద్వారా గుంట భూమిని అతి తక్కువ ధరకే అమ్ముతున్నామని, చుట్టు పక్కల హైవే రోడ్డు, ఆసుపత్రులు, రైల్వేస్టేషన్‌ను చూపిస్తూ ఆన్‌లైన్‌లో జోరుగా విక్రయిస్తున్నారు. మరి కొంతమంది వ్యాపారులు భూమి విక్రయించిన సదరు కొనుగోలుదారులకు అప్పగించకుండానే తామే అభివృద్ధిచేసి ఇస్తామని మాయమాటలు చెబుతున్నారు. రోజు రోజుకు మర్పల్లి మండలంలో ఫాం ల్యాండ్ దందా ఎక్కువవుతున్నా పట్టించుకునే అధికారులే కరువయ్యారని మండల ప్రజలు తెలిపారు. గతంలో కొంతమంది సర్పంచుల సహకారంతో అనుమతి లేని వ్యవసాయపొలాల్లో రోడ్లు పూర్తిచేసి అక్కడక్కడ భవనాలు నిర్మించారు. ఇప్పటికైనా సంబంధితాధికారులు స్పందించి అనుమతిలేని వెంచర్లపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.


ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేస్తున్న పోల్కంపల్లి రైతులు

పొలాల్లో కల్లు విక్రయాలను అరికట్టాలి

ఇబ్రహీంపట్నం, జూన్ 18:మండలంలోని పోల్కంపల్లిలో కల్లు గీత కార్మికులు ఇష్టానుసారం పొలాల్లో కల్లు అమ్మకాలు జరుపుతూ పంటచేలకు నష్టం చేకూరుస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పొలాల్లో కల్లు అమ్మకాలు జరపకుండా చూడాలని మంగళవారం ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ సీతారాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఏదో ఒకచోట షెడ్డు వేసుకొని తాటికల్లు విక్రయించకుండా చెట్టు ఎక్కడుంటే అక్కడే పొలాల్లో విక్రయాలు జరుపుతున్నారని, దీంతో కల్లు కోసం వచ్చే వారు పంటలను తొక్కుతున్నారని, అలాగే కల్లు ప్రియులతో పొలాల్లో పనిచేసుకునే మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని సీఐకి వివరించారు. పొలాల్లో కూలేందుకు సిద్ధంగా ఉన్న, కల్లుగీతకు పనికిరాని తాటిచెట్లను తొలగించాలని కోరారు. తాటి కాయలు, మట్టలు పడి చేలు పాడవుతున్నా గీత కార్మికులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయమై వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు అధికారిని కోరారు.


ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కందుకూరు, జూన్ 18 : పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరిస్తూ పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్, సీపీఎం మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం భోజన కార్మిక సంఘం నాయకులతో కలిసి విద్యావనరుల కేంద్రం వద్ద ధర్నా చేశారు. అనంతరం ఎంఈవో మనోహర్‌కు వినతిపత్రం ఇచ్చారు. భోజన కార్మికులకు జీతాలు, బిల్లులు ఇవ్వడం లేదన్నారు. కార్మికులు అప్పు చేసి విద్యార్థులకు అన్నం వండి పెడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆరు నెలలవుతున్నా భోజన కార్మికుల సమస్యలపై దృష్టిపెట్టడం లేదన్నారు. ఉద్యోగులకు ప్రతీ 5వ తేదీలోపు వేతనాలు ఇస్తున్న ప్రభుత్వం పుస్తెలు తాకట్టుపెట్టి విద్యార్థులకు అన్నం వండిపెడుతున్న భోజన కార్మికుల బిల్లులు ఎందుకు చెల్లించదని ప్రశ్నించారు. మార్కెట్‌లో కోడి గుడ్డు, టమాట, ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి తదితర కూరగాయల ధరలు విపరీతంగా పెరిగినా ప్రభుత్వం మెస్‌చార్జీలు మాత్రం పెంచడం లేదన్నారు. ఆందోళన కార్యక్రమంలో భోజన కార్మిక సంఘం నాయకులు శ్రీను, ప్రభావతి, అండాలు, అశ్విని, లక్ష్మమ్మ, భారతమ్మ, భాగ్యమ్మ, కలమ్మ, తదితరులు పాల్గొన్నారు.


మెడికల్ కళాశాలకు కేటాయించిన భూముల వద్ద రైతులతో మాట్లాడుతున్న కేఎల్లార్, కోదండరెడ్డి

మెడికల్ కళాశాల భూములను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యేలు

కందుకూరు, జూన్ 18 : మండలంలోని మీర్కాన్‌పేట పరిధిలో గత ప్రభుత్వం మెడికల్ కళాశాలకు కేటాయించిన భూములను మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ధరణి చైర్మన్ కోదండరెడ్డి పరిశీలించారు. మంగళవారం జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, తహసీల్దార్ కె.గోపాల్‌తో కలిసి వారు భూములను పరిశీలించారు. మీర్కాన్‌పేట పరిధి 112 సర్వే నంబర్‌లో 60 ఎకరాల భూమిని మెడికల్ కళాశాలకు కేటాయిస్తూ నిధులు మంజూరు చేశారు. కాగా ఈ భూమి మెడికల్ కళాశాల ఏర్పాటుకు అనుకూలంగా ఉందా? అని స్థానిక నేతలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కె.రాణాప్రతాప్‌రెడ్డి, ఢిల్లీ శ్రీధర్, జి.యాదయ్య, ఎస్.పాండు, డి.నర్సింహాచారి, ఏజీ.పాండుగౌడ్, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, జగన్, డి.నర్సింహ, సాయిలు, ఎ.సురేందర్, రూప్లానాయక్, జి.యాదయ్య, సంతోష్, శ్రీను, జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఆరు గ్యారంటీ'లను సద్వినియోగం చేసుకోవాలి


మల్లు రవిని సన్మానిస్తున్న గుర్రం కేశవులు, రమేశ్

ఆమనగల్లు, జూన్ 18 : ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను నిరుపేదలంతా సద్వినియోగం చేసుకోవాలని నాగర్‌కర్నూల్ లోక్‌సభ సభ్యుడు మల్లు రవి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చుతుందన్నారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ గర్రం కేశవులు, ఆర్యవైశ్య సంఘం నాయకుడు బికుమాండ్ల రమేశ్‌ల ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు మంగళవారం రవిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఎంపీగా గెలిచిన ఆయన్ను సత్కరించారు. మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని నాయకులు విన్నవించారు. మల్లు రవి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పెరిగిన ఓటింగ్ శాతం దీనికి రుజువన్నారు. రైతుల రూ.2లక్షల రుణమాఫీకి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని, సీఎం ప్రకటించిన విధంగా ఆగస్టు 15నాటికి రునమాఫీ పూర్తి చేస్తారని చెప్పారు. సామాజిక న్యాయం, అన్ని వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనునాయక్,మదుసూధన్‌రెడ్డి, కృష్ణనాయక్, వస్పుల మానయ్య, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు పనులను నిలిపివేయాలి

శంకర్‌పల్లి, జూన్ 18 : బయన్నగూడలో చెత్త డంపింగ్ యార్డు పనులను నిలిపివేయాలని ప్యాక్స్ డైరెక్టర్ కాడిగారి రాజశేఖర్‌రెడ్డి డిమాండు చేశారు. బయన్నగూడలో డంపింగ్ యార్డు ఏర్పాటు వద్దని కోరుతూ మంగళవారం గ్రామస్తులతో కలిసి ఆయన ఎంపీడీవో కార్యాలయ అధికారి రవిందర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గతంలో బయన్నగూడలో యార్డును ఏర్పాటు చేయగా, గ్రామస్తుల అభ్యంతరంతో అధికారులు విరమించుకున్నారని గుర్తుచేశారు. తిరిగి అదే స్థలంలో డంపింగ్ యార్డు పనులు చేపట్టే నిర్ణయం తగదన్నారు. డంపింగ్ యార్డు ఏర్పాటు చేసే స్థలానికి దగ్గరగా గ్రామస్తులకు బయన్నగుడి ఉందని తెలిపారు. ప్లాంటును ఏర్పాటు చేస్తే దుర్వాసన, కాలుష్యంతో గ్రామస్తులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. మహాలింగపురం పరిసరాల్లోనే డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.


ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు


వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర బీసీ సేనా అధ్యక్షుడు కృష్ణయాదవ్

బీసీ కుల గణన చేపట్టాలి

వికారాబాద్, జూన్ 18:ప్రభుత్వం వెంటనే బీసీ కులాల గణన చేపట్టాలని బీసీ సేనా రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వికారాబాద్ కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోపే బీసీ కులగణన చేపడుతామని చెప్పి ఇంకా చేపట్టడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కులాలగణన చేపట్టక పోగా, సకాలంలో నిర్వహించాల్సిన సర్పంచ్ ఎన్నికలను వాయిదా వేయడం వల్ల గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వారం గడువులో బీసీల జనాభా గణన సంపూర్ణంగా చేపట్టవచ్చని అన్నారు. ఆలస్యం చేయడం కేవలం రాజకీయ కారణమేనని, తక్షణమే సీఎం బీసీ కులగణన చేపట్టాలన్నారు. లేదంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సంగమేశ్వర్, లక్ష్మణ్ యాదవ్, కావలిరాములు తదితరులు పాల్గొన్నారు.


మహేష్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యమకారుల ఫోరం నాయకులు

ఉద్యమకారులకిచ్చిన హామీలను అమలు చేయాలి

మహేశ్వరం, జూన్ 18 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చామ శ్రీనివాస్, పల్నాటి నరేష్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఫోరం నాయకులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ప్రతీ ఉద్యమ కారునికి 250గజాల ఇంటిస్థలం, పెన్షన్, బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం తదితర హామీలను అమలు చేయాలన్నారు. స్పందించిన మహేష్‌కుమార్‌గౌడ్ ఉద్యమకారుల సమస్యలపై ముఖ్యమంత్రితో చర్చించి దాని కోసం ఓ కమిటీని ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యమకారులు నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఎర్రమట్టి తవ్వకాలు


ఎర్రమట్టి తవ్వకాలు

నవాబుపేట, జూన్ 18: మండలంలోని మముదాన్‌పల్లి గ్రామంలో ఎలాంటి అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. యథేచ్ఛగా ఎర్రమట్టి తవ్వకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. మూడు రోజులుగా ప్రభుత్వ సెలవులు ఉండటంతో ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు ఎర్రమట్టిని తోడేస్తున్నారు. ఈ దందాలో వికారాబాద్‌లోని ఓ ప్రముఖ కాంట్రాక్టర్ హస్తం ఉండటంతో తహసీల్దార్ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపించారు.

డబీల్‌పూర్‌లో సీతారాముల విగ్రహాలు ధ్వంసం

మేడ్చల్ టౌన్, జూన్ 18 : గుర్తు తెలియని దుండగులు ఆలయంలో సీతారాముల విగ్రహాలను ధ్వంసం ధ్వంసం చేసిన ఘటన మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తీవ్ర కలకలం సృష్టించింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలనాకి చేరుకుని విచారణ చేపట్టి గ్రామస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టె చర్య పట్ల గ్రామస్తులను అప్రమత్తం చేసి నిందితులను పట్టుకుంటామని భరోసా ఇచ్చారు. అందరు కలిసి మెలిసి ఉండే గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకోవటం పట్ల స్థానికులు విచారం వ్యక్తం చేశారు. గ్రామంలో వాతావరణం విచ్ఛిన్నం చేయటానికి ప్రయత్నించిన వారిన ఉపేక్షించరాదని గ్రామస్తులు పోలీసులను కోరారు. వివరాల్లోకి వెళితే మేడ్చల్ మండలంలోని డబీల్‌పూర్ గ్రామ శివార్లలోని గుట్టపై సీతారాముల ఆలయంలో గుర్తు తెలియని దుండగులు ప్రవేశించారు. సీతారాముల విగ్రహాలను ధ్వంసం చేశారు. మంగళవారం ఓ భక్తుడు స్వామి వారిని దర్శించుకోవడానికి ఆలయానికి వెళ్లగా విగ్రహాలను ధ్వంసం చేసినట్లు గుర్తించి గ్రామ పెద్దలకు చెప్పాడు. గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన మేడ్చల్ అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐమురళీధర్ సిబ్బందితో ఆలయం వద్దకు చేరుకున్నారు. అప్పటికే విగ్రహాల ధ్వంసం పట్ల తీవ్ర ఆగ్రహంతో ఉన్న గ్రామస్తులతో పోలీసులు సంప్రదింపులు జరిపి ఆలయ నిర్వాహణ గురించి తెలుసుకున్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టటానికి దుండగులు ఈ చర్యకు పాల్పడ్డారని పోలీసులు గ్రామస్తులను సముదాయించారు. దీంతో గ్రామస్తులు శాంతించి దుండగులను పట్టుకుని శిక్షించటానికి తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం పోలీసులు ఘటనా స్థలంలో ప్రాథమిక విచారణ జరిపారు. అనుమానితుల గురించి అడిగి తెలుసుకున్నారు. కాగాగ్రామంలో అన్ని మతాల వారు సామరస్యంగా కలిసి మెలిసి ఉంటున్నారని అయినప్పటికీ ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం దురదుష్టకరమన్నారు. ఘటనపై పూర్తి విచారణ జరిపి నిందితులను పట్టుకుంటామని పోలీసు అధికారులు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కాగా శాంతి భద్రతల దృష్ట్యా గ్రామంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి వరకు సీఐ సత్యనారాయణ గ్రామంలో ఉండి పరిస్థితిని సమీక్షించారు.


ఆలయంలో దుండగులు ధ్వంసం చేసిన సీతారాముల విగ్రహాలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

'గ్యారంటీ'లను అమలు చేయాలి

కేశంపేట, జూన్ 18:కాంగ్రెస్‌ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను వెంటనే అమలు చేయాలని బీజేపీ నాయకుడు కర్రెడ్ల నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సంతాపూర్ గ్రామంలో పింఛన్ పంపిణీ కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ వితంతు, వికలాంగులకు రూ.4వేలు ఇస్తామని చెప్పి ప్రభుత్వం నేటికీ పాత పింఛనే ఇస్తున్నరని ఆరోపించారు. ఇంట్లో ఇద్దరు వృద్ధులున్నా వారికీ పింఛన్ ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుబంధును రైతుభరోసాగా పేరుమార్చి సంవత్సరానికి ఎకరాకు రూ.15వేలు ఇస్తామని చెప్పి ఇప్పటికీ ఇవ్వడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు నరేందర్‌రెడ్డి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు, జూన్ 18: ప్రజాసంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయం అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం ఉత్తరాస్‌పల్లిలో మట్టిరోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఉత్తరాస్‌పల్లి నుంచి కొందుర్గు శివారు వరకు ఎస్‌డీఎఫ్ రూ.8లక్షలతో రోడ్డేశారు. రైతులకు ఉపయోగపడేందుకు ఈ రోడ్డును వేయించామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను రైతులు శాలువాతో సన్మానించారు. వందల సంవత్సరాలుగా పొలాలకు వెళ్లేందుకు రోడ్డులేక తీవ్ర ఇబ్బందులు పడ్డామని, ఎరువులు తీసుకువెళ్లాలన్నా, పంటలను ఇంటికి తీసుకురావాలన్నా సమస్య ఉండేదన్నారు. ఈ రోడ్డు వేయడం ద్వారా గ్రామంలోని దాదాపు 150 మంది రైతులకు మేలు జరిగిందని, మండల కేంద్రమైన కొందుర్గుకు నేరుగా వెళ్లేందుకు అవకాశం ఉందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంచంద్రయ్య, అంజిరెడ్డి, శివకుమార్, చాకలి పెంటయ్య, మల్లేష్ గౌడ్, బి.రవి, సిద్ధు, ఫయీమొద్దీన్, సి.కృష్ణయ్య, కృష్ణారెడ్డి, రవి, సి.సత్యయ్య, రాజు, సదానందం, సి.మల్లయ్య, నర్సింలు, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెర్లపటేల్‌గూడ మాజీ సర్పంచ్ మృతి

ఇబ్రహీంపట్నం, జూన్ 18 : చెర్లపటేల్‌గూడ మాజీ సర్పంచ్, ఉప్పరిగూడ ఫ్యాక్స్ మాజీ చైర్మన్ కంభాలపల్లి హన్మంతరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతిచెందారు.అంత్యక్రియలు మంగళవారం చెర్లపటేల్‌గూడలో జరిగాయి.ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిలు వేర్వేరుగా హన్మంతరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



హన్మంతరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

సీఎంను కలిసిన వైస్ ఎంపీపీ

ఆమనగల్లు, జూన్ 18: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళవారం ఆమనగల్లు వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మల్లెపల్లి క్యాంపస్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభ కార్యక్రమానికి హాజరైన సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు మండలంలో నెలకొన్న సమస్యలపై సీఎం దృష్టికి తీసుకెళ్లి మండలానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సీఎంను కోరగా సానుకూలంగా స్పందించారని అనంతరెడ్డి తెలిపారు.



రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న అనంతరెడ్డి

నారా భువనేశ్వరిని కలిసిన టీడీపీ నాయకులు



భువనేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేసిన రవీందర్ తదితరులు

ఇబ్రహీంపట్నం, జూన్ 18 : ఆంధ్రప్రదేశ్‌లో నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరడంలో టీడీపీ తెలంగాణ కార్యదర్శి జెలమోని రవీందర్ బృందం ఇబ్రహీంపట్నం నుంచి యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి అలయానికి పాదయాత్ర చేసింది. రెండ్రోజుల క్రితం ఇబ్రహీంపట్నంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభించి ఘట్కేసర్ మీదుగా 70కిలోమీటర్లు కొనసాగి యాదగిరిగుట్ట చేరింది. అక్కడ స్వామివారికి పూజలు చేసిన ఈ బృందం మంగళవారం నగరంలోని ఎన్టీఆర్ భవన్‌లో ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా బృందం నాయకులను ఆమె అభినందించారు. వీరి వెంట టీడీపీ తెలంగాణ మాజీ అధ్యక్షుడు బక్కని నర్సింలు ఉన్నారు.

విద్యార్థుల సౌకర్యార్థం అదనపు బస్సులు నడిపించాలి

చేవెళ్ల, జూన్ 18: విద్యార్థులు, ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు బస్సు సర్వీసులు నడిపించాలని బీజేపీ చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం చేవెళ్లలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇస్తున్నామని చెప్పి, బస్సుల సంఖ్యను బాగా తగ్గించిందన్నారు. గ్రామాలకు బస్సులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చదువులకు పట్టణాలకు వెళ్లే విద్యార్థులు సమయానికి చేరుకోలేకపోతున్నారు. విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం బస్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారులను డిమాండ్ చేశారు. సర్వీసులను పెంచకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, జైసింహ, గణేష్ ఉన్నారు.



మాట్లాడుతున్న అనంతరెడ్డి

రైతుకు నాయకుడి ఆర్థిక సాయం

షాద్‌నగర్, జూన్ 18: నందిగామ మండలం మామిడిపల్లిలో పిడుగుపాటుకు పశువులు చనిపోయి నష్టపోయిన రైతు బొద్ద శంకరయ్యకు కాంగ్రెస్ నాయకుడు జిన్‌కుంట్ల నవీన్‌గౌడ్ మంగళవారం 10వేల సహాయం అందజేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా కృషిచేస్తానని నవీన్‌గౌడ్ భరోసా ఇచ్చాడు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చిట్టి యాదవ్, రామక్రిష్ణ, విక్రమ్, సురేందర్ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న నవీన్‌గౌడ్

ఏడాదిలోపు అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు

ఆమనగల్లు, జూన్ 18: కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, తండాలకు ఏడాదిలోపు బీటీ రోడ్లు నిర్మించి రవాణా సౌకర్యం కల్పిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులతో మంగళవారం ఎమ్మెల్యే సమావేశమయ్యారు. గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణం, దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులపై వినతిపత్రాలు ఇచ్చారు. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని, వర్షాలు దెబ్బతిన్న రోడ్లను యుద్ధ ప్రాతిపదికన బాగుచేస్తామన్నారు.ప్రజలకు వసతుల కల్పనే కాంగ్రెస్ పాలన ధ్యేయమన్నారు. హైదరాబాద్-శ్రీశైలం రహదారి విస్తరణపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించగా కేంద్రప్రభుత్వ దృష్టికి తీసుకుపోయారన్నారు. నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కేఎల్ఐ డి-82 పనులను పూర్తి చేసి నెల రోజుల్లో 35వేల ఎకరాలకు నీరందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు జక్కు అనంతరెడ్డి, విజయ్‌రాథోడ్, బాబ, రవీందర్, రమేశ్‌గౌడ్, జగన్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మోత్య, హన్మ, నరేశ్‌నాయక్‌లు ఉన్నారు.



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిప్రతం అందజేస్తున్న నాయకులు

లేబర్ కార్డుదారులకు ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కేశంపేట, జూన్ 18: లేబర్ కార్డు ఉన్న కార్మికులకు మంగళవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. షాద్‌నగర్ లేబర్ అధికారి రాధ ఆధ్వర్యంలో వేములనర్వలోని బస్టాండ్ ఆవరణలో కూలీలకు సీఎస్సీ చిక్కడపల్లి వైద్య బృందం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, సుగర్, బ్లడ్ టెస్టులు నిర్వహించారు. 3 రోజుల్లో ఆరోగ్య పరీక్షల రిపోర్టులు ఇస్తామని తెలిపారు. గ్రామంలో సుమారు 40మంది కూలీలకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మనోహర్‌గౌడ్, అబ్దుల్లా, బాలు, కైసర్, కృష్ణయ్య, నవీన్, రామచేందర్ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లపై దాడులను నిరోధించాలి

శంషాబాద్, జూన్ 18: ఫొటోగ్రాఫర్లపై దాడులను నిరోధించాలని కోరుతూ దర్పణ్ ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం సాయంత్రం శంషాబాద్‌లోని హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు రాజు, మహేందర్, కృష్ణ, సాదిక్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణ్‌పురం మండలం పుట్టపాకకు చెందిన ఫొటోగ్రాఫర్ లింగం ఓ ఫంక్షన్‌లో ఫొటోలు తీస్తుంగా ఫంక్షన్‌కు వచ్చిన బంధువులు సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీయలేదని దాడిచేసి కొట్టారని తెలిపారు. ఈ సంఘటనను నిరసిస్తూ తాము ర్యాలీ నిర్వహించి ఫొటోగ్రాఫర్ల భద్రతపై ప్రభుత్వం, పోలీసుల దృష్టికి తెచ్చామన్నారు. ఫొటోగ్రాఫర్లకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. లింగంపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. లేకుంటే దర్పణ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శేఖర్‌గౌడ్, జగన్, ఈశ్వర్, నర్సింగ్, ప్రశాంత్, రాజిరెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఫొటోగ్రాఫర్లు

'గృహజ్యోతి'ని సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్, జూన్ 18 : అర్హులైన వారు గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అపర్ణ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో ఎన్నికల కోడ్ ఉన్న కారణంగా గృహజ్యోతి పథకం ఇప్పటివ వరకు వర్తించలేదని, కోడ్ ముగియడంతో అర్హులకు ఈ పథకం వర్తిసుందన్నారు. గృహజ్యోతి, గృహలక్ష్మి పథకాల్లో భాగంగా రూ.500కు గ్యాస్ సిలిండర్ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. అలాగే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం మీటర్ నంబర్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్లను కార్యాలయంలో అందజేయాలన్నారు. అర్హులను తాము ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న సూపరింటెండెంట్ విజయలక్ష్మి

ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్

కేశంపేట, జూన్ 18: ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నామని ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్ర జాపాలన దరఖాస్తుల సేవాకేంద్రాన్ని ప్రారంభించారు. ప్రజా పాలనలో దరఖాస్తులో పూర్తి వివరాలు ఇవ్వని వారు మరోసారి ప్రజాపాలన సేవా కేంద్రంలో వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. విద్యుత్ బిల్, గ్యాస్ కనెక్షన్ నంబర్, ఎల్‌పీజీ కస్టమర్ నంబర్, మొబైల్ నంబర్‌లను నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి'ని అర్హులందరికీ వర్తింపజేయాలి

శంషాబాద్ రూరల్, జూన్ 18: అర్హులైన ప్రతీ ఒక్కరికి గృహజ్యోతి పథకాన్ని వర్తింపజేయాలని మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలకమర్రి మహేందర్‌ముదిరాజ్ మంగళవారం ఎంపీడీవో మున్నికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలనలో దరఖాస్తు పెట్టుకున్న వారికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అమలు చేసే బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. చాల గ్రామాల్లో కొందరికి మాత్రమే గృహజ్యోతి అమలవుతోందని, పేదలందరికీ అదడం లేదని అన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని ప్రభుత్వం చెబుతోందని తెలిపారు. అధికారులు అర్హులను గుర్తించి వారికి పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వార్డు మాజీ సభ్యుడు రవీందర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు అనంద్, శ్రీను, సురేందర్ పాల్గొన్నారు.

సాయినగర్ కాలనీలో అధికారుల పర్యటన

యాచారం, జూన్ 18 : యాచారంలోని సాయినగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు వేయించడం కోసం ఎంత మేర నిధులు అవసరమవుతాయో అంచనా వేసేందుకు మంగళవారం ఎంపీపీ కొప్పు సుకన్య బాషా, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రజిత పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసుల సమస్యలు తెలుసుకున్నారు. భూగర్భ డైనేజీ, సీసీ రోడ్లకు అవసరమయ్యే నిధులపై వివరాలు సేకరించారు. తాగునీటి వసతి ఉందా? ప్రజలనడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ లేక తాగునీటి ఎద్దడి ఉందని కాలనీ వాసులు వారికి చెప్పారు. సమస్యలను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లి తాగునీటి వసతి కల్పిస్తామని ఎంపీపీ, ఎంపీడీవోలు కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. పంచాయతీ రాజ్ శాఖ ఏఈతో ఎస్టిమేషన్ వేయించి నిధులు రాబడుతామని వెల్లడించారు. కాలనీవాసులకు వసతులు కల్పించి ఆదుకుంటామని వారు పేర్కొన్నారు.

గ్రామాల్లోనూ విద్యార్థులకు నాణ్యమైన విద్య



సార్లరావుపల్లిలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధికారులు

కందుకూరు, జూన్ 18 : మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఎంఈవో మనోహర్ కోరారు. మంగళవారం సార్లరావులపల్లి పంచాయతీ ప్రత్యేక అధికారి సతీష్‌రెడ్డితో కలిసి ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. గ్రామ పాఠశాలలో విద్యార్థులు లేక 2010లో మూతపడిందన్నారు. ఈ నెల 6న డీఈవో ఆదేశానుసారం పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడిని కేటాయించి ప్రారంభించామన్నారు. బడీడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆకులమైలారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎం.అరుణకుమారి, ముచ్చర్ల ఎంపీటీసీ బి.మల్లేష్, పంచాయతీ కార్యదర్శి పి.జగదీశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎ.జహంగీర్, సీఆర్‌పీ వెంకటేష్, అంగన్‌వాడీ టీచర్, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాడ్గుల: మండలంలోని ఆర్కపల్లి, ఆశిరెడ్డిపల్లి, బ్రాహ్మణపల్లి, అంతమ్‌పేట పాఠశాలలను ఎంఈవో సర్దార్ సందర్శించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని అన్నారు. ఆర్కపల్లి పాఠశాలలో ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు.

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతొక్కరూ కృషిచేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ అన్నారు. హైతాబాద్ ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులందరికీ నోటుబుక్కులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ- ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేసి ఫలితాలు సాధించాలని, పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషిచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బీఈడీ/డీఈడీ ట్రైనింగ్ తీసుకున్న వారు భోదిస్తారని, అందుకే ప్రభుత్వ విద్య నాణ్యమైందన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వడ్ల చంద్రశేఖర్, ఖాజామియా, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రశాంత్, బాలయ్య, రవి, నర్సింహ, కృష్ణ, యాదయ్య, శ్రీనివాస్, రాముగౌడ్, నర్సింహారెడ్డి, దయానంద్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



మాడ్గుల: ఆర్కపల్లి ప్రాథమిక పాఠశాల ప్రార్థనలో పాల్గొన్న ఎంఈవో



షాబాద్: విద్యార్థులకు నోటుబుక్స్ అందజేస్తున్న కావలి చంద్రశేఖర్ తదితరులు

విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న రేవంత్ సర్కార్



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, జూన్ 18 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని జిల్లా పరిషత్ గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ సభ్యుడు, జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్రంలో మద్యం అమ్మకాలపై ఉన్న శ్రద్ధ విద్యపై లేదని, అందుకే అధికారంలోకి వచ్చి 6 నెలలు అయినా నేటికీ విద్యాశాఖకు మంత్రిని కేటాయించలేదని విమర్శించారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం దశరథ్ పర్యటించారు. మైసిగండి ఆశ్రమ పాఠశాలలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, వైస్‌ఎంపీపీ ఆనంద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ తులసీరామ్‌నాయక్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ బాల్‌రాజ్‌లతో కలిసి విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కడ్తాలలోని గిరిజన బాలుర హాస్టల్‌ను సందర్శించి భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కస్తూర్బా పాఠశాలలో నోట్ బుక్‌లు పంపిణీ చేశారు. దశరథ్ మాట్లాడుతూ అనేక ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు లేక, ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోందని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ఎస్‌వో అనిత, మాజీ సర్పంచ్‌లు హరిచంద్, సులోచనసాయిలు, శ్వేతభూనాథ్, భాగ్యమ్మ, జంగయ్య, నాయకులు వెంకటయ్య, జోగు వీరయ్య, నాయకులు పాండు, శ్రీను, కోట్య, కిషన్, రాజు, జైపాల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు ఉప్పల ట్రస్ట్ చేయూత

తలకొండపల్లి, జూన్ 18: నిరుపేద విద్యార్థిని చదువుకు తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన నాగమణి కూతురు అక్షిత పదో తరగతిలో ఉత్తమ ఫలితం సాధించింది. ఆర్థిక స్థోమత లేక ఇంటర్ చదువు కోవడానికి ఇబ్బంది పడుతోంది. వారు ఉప్పల వెంకటేశ్‌ను సంప్రదించగా స్పందించిన ఆయన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉన్నత చదువుకు చేయూతనందించారు. మంగళవారం ట్రస్ట్ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో అక్షితకు అడ్మిషన్ చేయించారు. నిరుపేద పిల్లల చదువులకు ప్రతి ఒక్కరు చేయూతనందించి ఆదుకోవాలని వెంకటేశ్ కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, తిరుపతి, కృష్ణ, రాజు, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

ఇంటి నిర్మాణానికి అండ

తలకొండపల్లి, జూన్ 18: వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన కానుగుల విజయ్ ఇంటి నిర్మాణానికి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. ఆర్థిక ఇబ్బందుల మూలంగా విజయ్ ఇంటి నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో అతడు జడ్పీటీసీ వెంకటేశ్‌ను ఆశ్రయించాడు. స్పందించిన వెంకటేశ్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇంటినిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను సమకూర్చారు. మంగళవారం ట్రస్ట్ సభ్యులు విజయ్‌కి మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హైమవతిరమేశ్, నాయకులు రాజు, పాండు, రంగయ్య, అసద్, విష్ణు, అశోక్, శ్రీను, లింగం, ఎల్లయ్య, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

షాద్‌నగర్ రూరల్, జూన్ 18 : షాద్‌నగర్ పట్టణ శివారులో మంగళవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. సీఎస్‌కే వెంచర్ నుంచి సర్దార్‌నగర్ వెళ్లే దారిలో మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. సుమారు 50 నుంచి 55సంవత్సరాల వయస్సు కలిగిన మగ వ్యక్తి తెల్లటి షర్టు ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

యాచారం, జూన్ 18: ఎదురెదురుగా వచ్చిన రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం సాయంత్రం చిన్నతూండ్లలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మహేశ్వరం మండలం పెద్దతూప్రకు చెందిన నర్సింహ(45) చిన్నతూండ్ల నుంచి ఇబ్రహీంపట్నం వైపు వెళ్తుండగా కందుకూరు మండలం కొలన్‌గూడలో మామిడితోట కాపలాదారుడు ఏడుకొండలు(38) ఎదురుగా వచ్చిన నర్సింహ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికీ ఎడమ కాళ్లు విరిగాయి. తలలకు గాయాలయ్యాయి. ఏడు కొండల నోటిలో నుంచి రక్తం కారింది. క్షతగాత్రులను వెంటనే నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా ఇద్దరి పరిస్థితి విషమంగానే ఉందని స్థానికులు తెలిపారు.

కబేళాకు తరలిస్తున్న 12 ఆవు దూడల పట్టివేత

ఆదిభట్ల, జూన్ 18: కబేళాకు అక్రమంగా తరలిస్తున్న 12ఆవు దూడలను రక్షించి వాటిని గోశాలకు తరలించిన ఘటన ఆదిభట్ల పరిధిలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. డీసీఎంలో నాదర్‌గుల్ మీదుగా నగరంలోని బార్కస్ కబేళాకు పశువులను తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు ఎస్సై వెంకటేష్ అధ్వర్యంలో పోలీసులు నాదర్‌గుల్ వంశీధర్ స్కూలు సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. డీసీఎం(టీఎస్ 05 యూడీ0883)ను కొద్ది దూరంలో ఆపి డ్రైవర్ పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతడిని పట్టుకొని డీసీఎంలో 7 మగ దూడలు, 2ఆవు దూడలు, 3కోడెలను గుర్తించారు. వాటిని తాళ్లతో బంధించి తరలిస్తున్నారు. డీసీఎం డ్రైవర్ గజ్జ రవి, మరో వ్యక్తి అబెద్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. నల్లగొండ జిల్లా మల్లెపల్లి సంతలో కొని బార్కస్ కబేళాలో పశువులను తరలిస్తున్నట్టు వారు ఒప్పుకున్నారు. 12పశువులను గోశాలకు తరలించి డీసీఎం వాహనాన్ని స్వాధీనం చేసుకొని డ్రైవర్‌పై కేసు నమొదు చేసినట్లు సీఐ వివరించారు.



డీసీఎం వాహనంలో తరలిస్తున్న ఆవు దూడలు ◄

సంక్షిప్తంగా...

● **ఇబ్రహీంపట్నం:** యాచారం-కందుకూరు రూటులో బస్సులను పునరుద్ధరించాలని మేడిపల్లికి చెందిన పొద్దుటూరి రవీందర్ ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డీఎం వెంకటనర్సప్పను కోరారు. డయల్ యువర్ డీఎం సందర్భంగా మంగళవారం బస్సుల సమస్యపై ఫోన్‌లో డీఎంతో మాట్లాడారు. మాల్-అజిలాపూరం నైట్ హాల్ట్ బస్సు, నందివనపర్తి మీదుగా వచ్చే తాడిపర్తి నైట్ హాల్ట్ బస్సు, కొత్తపల్లి, మేడిపల్లి, మొండిగౌరెల్లి నైట్‌హాల్ట్ బస్సులను నడపాలన్నారు. మేడిపల్లి, మాల్ మీదుగా ఆమన్‌గల్ వరకు నడిచే బస్సులను నాలుగేళ్లుగా నిలిపివేశారని వీటిని పునరుద్ధరించాలని కోరారు.

● **కడ్తాల్:** మండల పరిధిలోని మైసిగండి ఆశ్రమ పాఠశాల వద్ద నూతనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి జడ్పీటీసీ దశరథ్‌నాయక్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. లో-వోల్టేజీని నివారించి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ ఆనంద్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, తులసీరామ్ నాయక్, జోగు వీరయ్య, హరిచంద్, సాయిలు, జంగయ్య, పాండు, లోకేశ్ ఉన్నారు.

● **యాచారం:** మంతన్‌గౌరెల్లి, కేస్లీతండా,, నల్లవెల్లి, చింతపట్ల గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేస్తారని ఎంపీటీసీలు తెలిపారు.

● **యాచారం:** యాచారంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్ మొండిగౌరెల్లి ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ ఉండదని ఏఈ సందీప్‌కుమార్ తెలిపారు.

● **ఆమనగల్లు:** ఆమనగల్లు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 21న మండల పరిషత్‌లో ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. ఎంపీపీ అనిత అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి

చేవెళ్ల, జూన్ 18: వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరు లతో మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధు లు ప్రబలుతాయని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్ల ముందు వర్షపు నీరు నిలిస్తే దోమలు స్వైరవిహారం చేస్తాయని, దోమల ద్వారా మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, బోధకాలు తదితర వ్యా ధులు వస్తాయన్నారు. జ్వరం లాంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని సూచించారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతలు పాటించాలని తెలిపారు.

'ఏపీఎంపై ఆరోపణలు అవాస్తవం'

చౌదరిగూడ, జూన్ 18 : ఏపీఎం రామస్వామి మహిళా వీవోఏలను వేధిస్తున్నాడని సోషల్ మీడియాలో, పత్రికల్లో వచ్చిన వార్తలు నిజం కాదని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, వీవోఏలు అన్నారు. కొందరి తప్పుడు ఆరోపణలో మూడు రోజులుగా వస్తున్న వార్తలతో జిల్లేడ్‌చౌదరిగూడ మండల సమాఖ్యకు, 25మంది వీవోఏలకు తలవంపులు తెచ్చారన్నారు. మంగళవారం సమాఖ్య భవనంలో వారు మాట్లాడుతూ.. సిబ్బందినైనా, సభ్యులనైనా ఎవరైనా వేధిస్తే తాము ఊరుకుంటామా? అని ప్రశ్నించారు. ఏపీఎం ఎప్పుడూ అసభ్యకరంగా మాట్లాడలేదని, అసత్య ప్రచారాన్ని ఎవరూ ప్రోత్సహించొద్దని కోరారు. ఆరోపణలు నిజమైతే మహిళా సమాఖ్యనే పోలీసులకు ఫిర్యాదు చేస్తుం దన్నారు. ఎదిర క్లస్టర్ ఆర్థిక లావాదేవీల్లో జరిగిన అవకతవకలపై ప్రశ్నించినందుకే దానిపై నిగ్గుతేల్చకుండా ఉండేందుకే గొడవలు సృష్టిస్తున్నారన్నారు. అలాగే తాము ఏపీఎంకు వ్యతిరేకంగా మాట్లాడడం లేదని మహిళా సమాఖ్యపై వాట్సాప్ గ్రూపులో అవమానకర పోస్టు పెట్టిన చౌదరిగూడ వీవోఏ నస్రీన్‌బేగంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇదిలా ఉంటే ఏపీఎం రామస్వామిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కొందరు వీవోఏలు, బీజేపీ నాయకులు మండల పరిషత్ వద్ద ధర్నా చేసి తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌లకు ఫిర్యాదు చేశారు. కాగా ఏపీఎంపై వచ్చిన ఆరోపణలపై విచారణకు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యారావు వచ్చారు.సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, వీవోఏలతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. దీనిపై కలెక్టర్‌కు రిపోర్టు అందజేస్తానని ఆయన తెలిపారు.